ISSN 2583-9020

An Electronic Veda Journal

# वेद वाणी

(vEda vaaNee)

Volume 2, Issue 3, October 2024



Printed and Published by

**Veda Samskruti Samiti**

Malkajgiri

Hyderabad TS

# సనాతన ధర్మంలో అగ్ని - వైశిష్ట్యము

[Agni in Sanātana Dharma - Vaiśiṣṭyamu]

**Raghava S. Boddupalli**

Institute of Sanskrit and Vedic Studies, Sanjayanagar, Bangalore
raghava7boddupalli@gmail.com

**Abstract**

According to Vedic texts, every elemental force is presided over by a deity. Agni is one of the Vedic deities who received tremendous importance in all the Veda *Saṃhitās*, *Brāhmaṇās*, *Āraṇyakas*, *Upaniṣads*, *Śrauta* and *Gṛhya* Sutras and *Epics*. He is one of the major and often invoked Gods. *Agni Devata* remains as an integral part of the Sanātana Dharma rituals and also a witness as *Agni Śakti*. He is intermediary between Gods and human beings. *Agni* pervades as fire on the earth, as lightning in the atmosphere, and as the Sun in the sky. The place of Agni is unique and stands first among all the Gods revealed in the Yajurveda *Taittirīya Saṃhitā*. Among the forty chapters of the *Taittirīya Saṃhitā*, *Agni* is mentioned in thirty-one chapters. The inherent effects of *Agni* mantras/liturgies can be referred in these thirty-one chapters. By worshiping *Agni*, He will induce virtuous way of life, assures all kinds of pleasures and will not allow to do wrong ways in life. He will cause us to conquer our inner enemies and gain wisdom. *Agni* induces *Ātma jñāna* and *mānasika vijñāna* (mental knowledge) which leads to *mokṣa* (salvation)

.

**సంక్షిప్త పదములు** — ఋ. సం. — ఋగ్వేద సంహితా; శు. య. సం. — శుక్ల యజుర్వేద సంహితా; శ. బ్రా. — శతపథ బ్రాహ్మణము; తై. య. సం. — తైత్తిరీయ యజుర్వేద సంహితా; తై. బ్రా. — తైత్తిరీయ బ్రాహ్మణము; తై. ఆ. — తైత్తిరీయ ఆరణ్యకము; సా. సం. — సామ సంహితా; అ. సం. — అథర్వవేద సంహితా

## అగ్ని పరిచయము

వేద గ్రంథాలను అనుసరించి, ప్రతి మౌలిక శక్తికి ఒక అధిష్ఠాన దేవత ఉంటుంది. తేజస్సు, నిప్పు మరియు వేడి యొక్క అధిష్టాన దేవత 'అగ్ని'. అష్టదిక్పాలకులలో అగ్ని ఒకరు. ఇతని దిక్కు ఆగ్నేయం (పూర్వదక్షిణము). అగ్నిదేవుని భార్యలు కుడివైపు స్వాహాదేవి, ఎడమవైపు స్వధాదేవి కూర్చొని ఉందురు. పట్టణము తేజోవతి. వాహనము మేషము. ఆయుధము శక్తి. ఇతఁడు అష్టవసువులలో ఒక్కఁడయి వసువుల కందఱకును రాజై ఉండును. 'అనలుఁడు' అనియు ఇతనికి నామము కలదు. కొందఱు అగ్నిని బ్రహ్మ

జ్యేష్ఠపుత్రుడందురు. అతనినామము 'అభిమానాగ్ని'. అగ్ని, ఆకాశం, నీరు, వాయువు మరియు పృథివి పంచభూతములుగా చెప్పబడును. భూమిపై అగ్ని నిప్పుగా, వాతావరణంలో మెరుపులాగా, ఆకాశంలో సూర్యుడిలాగా మూడు స్థాయిల్లో సంచరించును [7].

## అగ్నిరూప వర్ణన

శ్లో ॥ సప్తహస్తః చతుఃశృఙ్గః సప్తజిహ్వో ద్విశీర్షకః |

త్రిపాత్ ప్రసన్నవదనః సుఖాసీనః శుచిస్మితః ||

స్వాహాన్తు దక్షిణే పార్శ్వే దేవీం వామే స్వధాం తథా |

బిభ్రద్దక్షిణ హస్తైస్తు శక్తి మన్నం సృచం సృవమ్ ||

తోమరం వ్యజనం వామైర్ఘృతపాత్రం తు ధారయన్ |


మేషారూఢం జటాబద్ధం గౌరవర్ణం మహౌజసమ్ ||

ధూమధ్వజం లోహితాక్షం సప్తార్చిః సర్వకామదమ్ |

ఆత్మాభిముఖ మాసీనమేవం ధ్యాయేద్ధుతాశనమ్ ||

అగ్నిని ఎఱ్ఱటి శరీరంతో సనాతనుడుగా, శాశ్వతమైన జీవిగా సూచిస్తారు. అగ్ని దేవునకు ఏడు చేతులు, నాలుగు కొమ్ములు, ఏడు నాల్కలు, రెండు ముఖాలు, మూడు పాదాలు. అగ్ని ప్రసన్నవదనుడు. మేష వాహనుడు. కుడివైపు నాలుగు చేతుల్లో - శక్తి, అన్నం, సృక్, సృవం; ఎడమవైపు మూడు చేతుల్లో - తోమరం, వ్యజనం, ఘృతపాత్ర ధరించి ఉంటాడు. అగ్ని అల్లిన జుట్టు కలిగి, ఎఱ్ఱటి వస్త్రాలు మరియు యజ్ఞోపవీతము ధరించి ఉంటాడు. ఇది యజ్ఞ దేవుడైన అగ్నిరూపం. పైన చెప్పబడిన శ్లోకం ఆధారముగా, అగ్నిచిత్రరూప ప్రతిపాదన చిత్రపటం — 1లో చూడవచ్చును.

'స్వాహా' అంటూ వేదమంత్రములతో దేవతలను ఉద్దేశించి అగ్నికి ఆహుతులిస్తాము. పితృ దేవతలను ఉద్దేశించి 'స్వధా' కారంతో అగ్నికి ఆహుతులిస్తారు. స్వాహా స్వధాకారాలే యజ్ఞమూర్తి యొక్క శక్తులు. ఆ తత్త్వాన్ని తెలియజేసేదే - స్వాహా, స్వధా దేవతలతో కూడిన అగ్నిరూపం.



చిత్రపటం — 1: అగ్నిరూపం

శక్తి, తోమరం, వ్యజనం – అగ్నియొక్క పరాక్రమాన్ని తెలియచేసే ఆయుధాలు. వాయువును ప్రజ్వలింపచేయుటకు సాధనం వ్యజనం (విసనకర్ర).

అన్నం, ఘృతపాత్ర – యజ్ఞ ద్రవ్యాలు, స్రుక్, స్రువాలు యజ్ఞపరికరాలు. ఇవే అగ్నిస్వామి ఆయుధాలు మరియు యజ్ఞతత్త్వాన్ని తెలియచేసేవి. జటాధారణ, ధవళవర్ణం - జ్ఞానపూర్ణమైన శుద్ధత్వాన్ని తెలియచేసేవి. అగ్ని పరాక్రమవంతుడు, కనుకనే 'మహౌజసుడు' (గొప్ప తేజస్సు కలవాడు) అని అన్నారు. అగ్ని కాంతి స్వరూపుడు. కాంతి సప్తవర్ణవిలసితం. కనుకనే సప్తజిహ్వలు, సప్త హస్తాలు అని వర్ణింపబడింది **[3]**.

## సప్త, సప్తపద అగ్నిమంత్రం

అగ్నివర్ణన విశిష్టత గురించి చెప్పిన ఒక ప్రసిద్ధమైన మరియు యజుర్వేదమునకు ప్రత్యేకమైన అగ్ని మంత్రమును ఇక్కడ పరిశీలిద్దాం:

**సప్త తే అగ్నే సమిధ స్సప్త జిహ్వా స్సప్తర్షయ స్సప్త ధామ ప్రియాణి | సప్తహోత్రా" స్సప్త ధా త్వా యజన్తి సప్త యోనీరా పృణస్వా ఘృతేన ||** – తై. య. సం. **[1-5-3(12), 4-6-5(25)]**

ఈ మంత్రము కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహితా [1-5-3(12), 4-6-5(25)], తైత్తిరీయ బ్రాహ్మణం [3-11-5(29)], శుక్ల యజుర్వేద మాధ్యన్దిన సంహితా (17-79) మరియు శతపథ బ్రాహ్మణం [9-2-3(44)] నందు పేర్కొనబడినది. ఈ సప్తపద మంత్రం కృష్ణ యజుర్వేద సంహిత యందు రెండు కాండలలో [1-5-3(12), 4-6-5(25)] వెల్లడిచేయటం యజ్ఞ సంబంధం కలిగిన ఈ మంత్రం యొక్క ప్రాముఖ్యత తెలియచేస్తున్నది. ఈ మంత్రానికి అర్థం ఇక్కడ తెలుసుకుందాం – "ఓ అగ్నీ! నీకు అశ్వత్థము (*Ficus religiosa*), ఉదుంబరము (*Ficus racemosa*), పలాశము (*Butea monosperma*), శమి (*Prosopis cineraria*), వికంకతము (*Flacourtia indica*), అశనిహతవృక్షము (any tree hit by a thunderbolt), పుష్కర పర్ణము (*Nymphaea nouchali*) అను సమిధలు ఏడు కలవు (చిత్రపటం – 2). నీకు కాళి, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరుచి అను నాలుకలు (జిహ్వలు) ఏడు కలవు. పూర్వోక్త సమిత్సంపాదనార్థములైన । **అశ్వో రూపం కృత్వా యదశ్వత్థేఽతిష్ఠః** ॥ (తై. బ్రా. 1-1-9), ఇత్యాది మంత్రములు నీకు సప్త సంఖ్యాకములు కలవు. నీకు ఆహవనీయము, గార్హపత్యము, దక్షిణాగ్ని, సభ్యము, అవసథ్యము, ప్రాజహితము, ఆగ్నీధ్రీయము అనెడి ప్రియమైన స్థానములు ఏడు కలవు. నీకు హోత్ర, ప్రశాస్త,




చిత్రపటం – 2: అగ్నికి ప్రియమైన ఏడు వృక్షజాతుల సమిధలు [తై. య. సం. - 1-5-3(12), 4-6-5(25)]

బ్రాహ్మణాచ్ఛంసి, పోత, నేష్ట, ఆగ్నీధ్రుడు, అచ్ఛావాకుడు అను హోతృ ప్రముఖులైన వషట్కర్తలు ఏడుగురు కలరు. యజమానులు అగ్నిష్టోమము, అత్యగ్నిష్టోమము, ఉక్థ్యము, షోడశి, అతిరాత్రము, అప్తోర్యామము, వాజపేయము అనెడి ఏడు విధములుగా నిన్ను పూజించుచున్నారు. అటువంటి నీవు ఆహవనీయాది స్థానములు ఏడింటిని అంతటను నేతితో పూరించుము. సప్త, సప్తపద ఘటితమైన ఈ మంత్రమును పఠించుచు స్రుచములోనికి పన్నెండు పర్యాయములు ఆజ్యమును తీసుకొని పూర్ణాహుతిని అగ్నికి హోమము చేయవలెను. ఈ మంత్రములో వాచక

లుప్తోపమాలంకారము కలదు. ఆజ్యముచే అగ్ని వృద్ధి చెందునట్లు, విద్య మున్నగు శుభగుణములచే సకల మానవులు వృద్ధిని పొందుదురుగాక. విద్వాంసులు అగ్నియందు ఘృతము, హవ్య సామగ్రి మున్నగువానిని హోమమొనర్చుచు జగమునకు ఉపకారమొనర్చునటులనే, మన మెల్లరము యజ్ఞాదులను ఒనర్చవలయును''. ఈ మంత్రాన్ని వివిధ కార్యక్రమాలలో పూర్ణాహుతి' సమయంలో పఠిస్తారు. ఈ సప్త, సప్తపద మాత్రలను పఠించేటప్పుడు, పన్నెండు సార్లు ఆజ్యాన్ని స్రుక్ స్రువముల ద్వారా తీసుకుని అగ్నికి సమర్పించాలి [5,7,8].

## అగ్ని ఆరాధన

విధిగా ఆచరించవలసిన కర్మలలో ముఖ్యమైనది 'అగ్న్యాధానము'. ఇది పఞ్చాగ్ని లేక త్రేతాగ్ని ఉపాసన, శ్రౌతకర్మలకు ఈ యాగము పునాది వంటిది. కల్పములో అగ్న్యాధాన కర్మను మూడు రకములుగా ఆరంభమున ఉపదేశింపబడినది. అవి: 1. అగ్నిహోత్రపూర్వము (నక్షత్రాధానము), 2. ఇష్టిపూర్వము (దర్శపూర్ణమాసారంభములలో), 3. సోమపూర్వము (సోమయాగారమ్భములో).

అగ్నిహోత్రములను పఞ్చాగ్నులు (ఈశాన్యదిక్కునందుండును) లేక త్రేతాగ్నులుగా (పూర్వ దక్షిణ పశ్చిమదిక్కులయందుండును) ఉపాసించవలయును. 1. గార్హ్యపత్యం (గృహస్థు ఇంట్లో ఎప్పుడూ ఉండే అగ్ని), 2. దక్షిణాగ్ని (యజ్ఞ వేదికకు దక్షిణ దిశన ఉంచే అగ్ని), 3. ఆహవనీయము (అగ్నిహోత్రభేదము), 4. సభ్యము (హోమరహితాగ్ని), 5. అవసథ్యం (ఔపోసనాగ్ని) అను పఞ్చాగ్నులు. త్రేతాగ్నులలో గార్హ్యపత్యము గృహపతి స్థానము, దక్షిణాగ్ని అన్నస్థానము, మరియు పితృదేవతాకమయిన కర్మలకు స్థానము, ఆహవనీయాగ్ని (ఈ అగ్నియే సమ్రాట్టు స్థానము) త్రేతాగ్నులలో సర్వలోకములకు ఉపకారముగ ఉన్నది. ఈ అగ్నియే ప్రభువువంటిది. ఆహవనీయాగ్నిలో సమస్త హోమము జరుపుట వలన ఆహవనీయాగ్నికి సమ్రాట్ స్థానము. ఆహవనీయాగ్నికి హోమము జరిగిన పిదప, గార్హ్యపత్యములో గృహాభిమాన దేవతలకు, దక్షిణాగ్నిలో అన్నపతి దేవతలకు హోమము జరుగును. అగ్నిహోత్ర సమయమున తన పాపములు అన్నియు పోవు విధముగా 'అహ్నా యదేనః కృతమస్తి పాపం, రాత్ర్యా యదేనః కృతమస్తి పాపం' అని అగ్నిని ప్రార్థన చేయుచున్నాము.

హోమశేషమును గర్భవృద్ధి కొరకు 'గర్భేభ్యస్త్వా గర్భాన్ప్రీణీహి' అని అగ్ని, సూర్యాభిమాన

దేవతలను ఉచ్చరిస్తూ భక్షణ చేయవలయును. ఈ విధముగ అగ్నిహోత్రకర్మ సకల పాపహరము, సకల పుణ్యప్రదము అయిఉన్నది. గార్హపత్యాగ్ని నుంచి అగ్నిని ఉద్ధరణ సమయములో వాక్ ప్రాణ చక్షుమన శ్రోత్రములు, 'హోతృఉద్గాతృ అధ్వర్యుర్బ్రహ్మాగ్నీత్' అను పాంక్త దేవతలతో కూడిన సూత్ర మంత్రముతో అగ్నిని ఉద్ధరిస్తున్నాము. ఇట్టి మహత్తరమయిన కర్మను ఆచరించి యజ్ఞేశ్వరానుగ్రహమును పొందగలవారము. పవిత్ర భారతదేశమందు ఎంతో మంది నిత్యాగ్నిహోత్రులు, అగ్ని ఉపాసకులు ఉన్నారు.

## వేద విచారణ

వేదాలలో అగ్ని అత్యంత ప్రాచీనమైన మరియు ముఖ్యమైన దేవతలలో ఒకరు. అగ్ని యజ్ఞ, యాగాది ఆచారాలలో ప్రధాన పాత్ర పోషిస్తాడు. అగ్ని స్తుతి మరియు ప్రస్తావన ఋగ్వేద సంహిత (ఋ. సం.) యందు 1858 సార్లు, అథర్వవేద శౌనక సంహిత (అ. సం.) యందు 574, సామ సంహిత (సా. సం.) యందు 375, శుక్ల యజుర్వేద సంహిత (శు. య. సం.) యందు 512 మరియు తైత్తిరీయ యజుర్వేద సంహిత (తై. య. సం.) యందు 1126, శ్రీమద్రామాయణము యందు 73, శ్రీమహాభారతము యందు 489 సార్లు ప్రశంస జరిగింది. అగ్ని దేవుడిగా, అగ్ని మానవ రాజ్యం మరియు ఖగోళ రాజ్యం మధ్య వాహిక మరియు దూత. అగ్నిని దేవతల నోటిగా భావిస్తారు - । అగ్నిముఖా ఏవ దేవతాః'' ప్రీణాతి । అగ్నిం వా అన్వన్యా దేవతాః'' ॥ – (తై. బ్రా. 3-7-1). యజ్ఞ, యాగాదులందు మనం సమర్పించే హవిస్సును, అగ్నే ఆయా దేవతలకు నేరుగా సమర్పించును [3,7,8].

శుక్ల యజుర్వేద మాధ్యందిన సంహితలో మొత్తం నలభై (40) అధ్యాయాలు ఉన్నాయి. అందు ముప్పైఒక్క (31) అధ్యాయాలలో 'అగ్ని' ప్రస్తావన పేర్కొనబడింది. దాదాపు ఇన్ని అధ్యాయాలలో ఇంతగా ఏ ఇతర దేవత ప్రస్తావింపబడలేదని చెప్పవచ్చు. ఈ 31 అధ్యాయాల్లో అగ్ని ప్రస్తావనకల మంత్రభాగాల్లో అతని స్వభావ ప్రభావాలు మనకు స్పష్టంగా తెలుస్తాయి.

అగ్ని సత్యభాషణం మొదలగు సామాన్య ధర్మాలను చక్కగా పరిపాలిస్తూ, సత్యవ్రతాన్ని నిర్వహించేవారికి అండదండలనిస్తాడు (1-5). అగ్నికి లోకంలోని ప్రతివిషయం తెలుసు. విజ్ఞానస్వరూపుడైన ఇతడు తనను ఆరాధించేవాళ్ళకు జ్ఞానాభివృద్ధిని కలుగజేస్తాడు (2-14). ఇతడు వస్తువులన్నింటికి అధిపతి. సంపదలకు నివాసస్థానం. కనుక ప్రజలనితడు

**నిరంకుశత్వాన్నుంచి కాపాడతాడు** (5-9). **వేదాలను కాపాడుతూ మానవుల భయాలన్నిటిని పోగొడుతూ, వారి ధర్మవర్తనాన్ని కాపాడతాడు** (5-9).

**లోకంలో అనేక రకాల దోషాలనితడు నాశనం చేస్తాడు.** **ఇతరులకు ద్రోహం చేసేవారిని శిక్షించి జగత్తును రక్షిస్తాడు** (1-8). **శత్రువులను నాశనం చేసి, ప్రతి ప్రాణికి సుఖదుఃఖ వ్యవహారాలను కలిగిస్తాడు. సృష్టి స్థితులకితడే కారకుడు.** **ఆత్మజ్ఞానాన్ని మానసిక విజ్ఞానాన్ని కలిగించి, మనలోని అంతశ్శత్రువులను జయించడానికి, జ్ఞానాన్ని పొందడానికి కారణభూతుడవుతాడు** (1-10). **ప్రపంచ మంతటికి సంతోషం కలగజేయడానికి ఇతడు యజ్ఞాన్ని అంతటా వ్యాపింపచేసి వర్షాన్నిస్తాడు** (2-3). **ఇతరుల వస్తువులను అన్యాయంగా అపహరించే వాళ్ళను, లోకానికి వ్యతిరేకంగా ఎప్పుడూ తమ సుఖం కోసమే ప్రతిపనీ చేసేవాళ్ళను దూరంగా తరిమేస్తాడు** (2-30). **ప్రాతః కాలంలో లోకంలోని వస్తువులన్నింటినీ ప్రకాశింపచేస్తున్నాడు** (3-10). **భౌతికాగ్నిగా పృథివీపాలనకు కారణమై, జఠరాగ్నిగా ప్రాణులలోను, విద్యుత్తుగా జలంలోను శక్తిని ఉత్పత్తి చేస్తున్నాడు** (3-12). **సూర్యుడుగా లోకాలనభివృద్ధి చేస్తూ, మానవుల రాజ్యాది సంపదలను పెంపొందింపచేస్తున్నాడు** (3-14). **ఈ జగత్తులోని విద్వాంసులు మంచిబుద్ధితో వివేకంతో ప్రకాశిస్తూ, తోటి ప్రజల్లో కూడా వారు వివేకాన్ని కలిగించడానికి పూనుకొనేట్లు చేస్తున్నాడు** (11-41). **మానవులు మంచి గుణాలను, కర్మలను సాధించడానికి అగ్ని ఎంతగానో సహాయపడతాడు** (12-104). **లోకానికి ధర్మ-అర్థ-కామ-మోక్షాలనే పురుషార్థాల జ్ఞానం కలిగిస్తూ** (27-43), **తనను గురించి తెలుసుకొన్నవారు అద్భుతకార్యాలను చేసేటట్లు చేస్తున్నాడు** (29-20). **ఇతడు అన్నం మొదలగు పదార్థాలను పవిత్రం చేసి వాటిద్వారా బలాన్ని, విజ్ఞానాన్ని అభివృద్ధిచేస్తూ, మానవులు దుష్టుల సాంగత్యాన్ని చేయకుండా చూస్తున్నాడు** (35-16).

**అగ్నిదేవతను సేవించడంద్వారా ప్రజలు మంచి గృహస్థులై సోమరితనం లేకుండా గృహస్థాశ్రమవిధులను సక్రమంగా నిర్వహించ గలుగుతారు** (2-27). **రాత్రింబగళ్ళు అగ్నితో సంబంధం ఉండుటవలన వివేకం కలిగి జ్ఞానానికి లొంగివుంటారు. ధర్మాచరణానికి, అధర్మాన్నుంచి ధర్మాన్ని కాపాడడానికి, అగ్నివల్ల ఎంతైనా సాహాయ్యం లభిస్తుంది** (4-28). **అగ్నివల్ల ప్రజలు సన్మార్గంలో నడుస్తారు. అన్నిరకాలైన సంతోషాలను పొందుతారు. తప్పుడు మార్గాల జోలికి పోరు** (5-36).

అగ్నిని ఉపాసించడం ద్వారా మనలో కోరికలు అణఁగిపోయి, మనోనిగ్రహం కలిగి పెంపొందింపబడుతుంది. భూ-ధన-ధాన్య-సంపదలు పెంపొందుతాయి. తేజస్సు పెరిగి, దేహకాంతి రెట్టింపు అవుతుంది. మన శత్రువులకు నాశనం కలిగి యుద్ధాలలో మనకు విజయ లభిస్తుంది. పిశాచాది గ్రహాలబాధ తొలగి అపమృత్యుభయం తీరిపోతుంది. ఇతని వల్లనే రాత్రిపూట చీకట్లో కూడా మానవులు తమ స్వరూపం ఇతర వస్తువుల స్వరూపం తెలుసుకొంటూ, అనేక వ్యవహారాలు చేయగలుగుతున్నారు. అగ్నివల్ల దుఃఖాలు నశించి మనకు ఉత్తమసుఖం లభిస్తుంది [1].

కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహితలో మొత్తం నలభై నాలుగు (44) ప్రపాఠకాలు ఉన్నాయి. ఇందులో వందమందికి పైగా దేవతల ప్రస్తావన వస్తుంది. వీరిలో అగ్నికి గల స్థానం అద్వితీయమైంది [1,2]. కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహితలో 'అగ్ని' పేరు సంభవించే తరచుదనం - కాండ 01లో 278 సార్లు, కాండ 02లో 218, కాండ 03లో 86, కాండ 04లో 249, కాండ 05లో 198, కాండ 06లో 66 మరియు కాండ 07లో 31 సార్లు ప్రస్తావన వస్తుంది. కృష్ణయజుర్వేద తైత్తిరీయ సంహితా చతుర్ధ కాణ్డమున 'అగ్నిచయన కర్మ' ప్రతిపాదితము అగుటచే దీనికి 'అగ్నికాణ్డము' అని వ్యవహార నామము ఏర్పడినది. రుద్రాధ్యాయమునందు (తై. య. సం. 4-5-1) రుద్రభగవానుని ఆదిత్య రూపుడుగా వర్ణింపబడినది, । అసౌ యస్తామ్రో అరుణ ఉత బభ్రుః సుమఙ్గలః । యే చేమాగ్ం రుద్రా అభితో దిక్షు శ్రితాః సహస్రశోఽవైషాగ్ం హేడ ఈమహే ॥ తైత్తిరీయ ఆరణ్యకమునందును పరమేశ్వరుడు ఆదిత్య రూపుడుగా వర్ణింపబడియుండెను. దీనినిబట్టియు । రుద్రో వా ఏష యదగ్నిః ॥ (తై. య. సం. 5-4-3) అనుశ్రుతివచనము ననుసరించియు రుద్రుడే అగ్ని [5,8].

## అరుణ ప్రశ్నలో సూర్యభగవానుడూ అగ్నే

తైత్తిరీయ ఆరణ్యకం అరుణ ప్రశ్ననందు అష్ట అగ్నిహోత్రులున్నట్లు చెప్పబడింది. అవి: 1. అగ్ని 2. జాతవేదుడు 3. సహోజుడు 4. అజారాప్రభువు 5. వైశ్వానరుడు 6. నర్యాపుడు 7. పంక్తిరథుడు, 8. విసర్పుడు [5,8].

### మహాన్యాసరుద్రుడూ అగ్నే

బోధాయనమహర్షి వ్యవస్థచేసిన మహాన్యాసమున వినియుక్తములయిన కొన్ని ఆయామంత్రములు వేరు వేరు దేవతలను స్తుతించుచున్నట్లు కనబడుచున్నను, పర్యవసానమున అగ్నిని ప్రధానదేవతగా భావించి స్తుతించునవే. వీనిలో

ముఖ్యముగా తై. య. సం. 1-3-3 అనువాకమునందు పదునారు అగ్నుల నామములు అన్నియు రుద్రనామక దేవతయే. ఇవియే మహాన్యాసమునందున్న షోడశాంగరౌద్రీకరణ మంత్రములు. తై. య. సం. 1-3-14 అనువాకము నందున్న 28 మంత్రములును అగ్నిని స్తుతించునవియే. ఈ మంత్రములను మహాన్యాసమునందలి సాష్టాంగ నమస్కార ప్రక్రియలో ఆరు మంత్రములలో నాలుగు అగ్నిమంత్రములే. శ్రుతిననుసరించి అగ్నితత్త్వవిశేషమే ఒక విధముగా బృహదారణ్యకోపనిషత్ప్రథమాధ్యాయమున చెప్పబడిన పరమేశ్వరతత్త్వమే అనియు - మరియొక విధముగా తైత్తిరీయారణ్యకమున అరుణప్రశ్నమునందు ప్రతిపాదించిబడిన 'అగ్నివాయ్వాదిత్యాది' తేజోమిశ్రణరూపమగు ప్రాకృతికతత్త్వమగు దేవత అనియు — తెలియును [4].

త్ర్యంబకుని ఆరాధనమును । 'ఆదిత్యశ్చక్షుర్ భూత్వాఽక్షిణీ'' ప్రావిశత్' ॥ – 'ఆదిత్యుడు చక్షుస్సుగానయి నేత్రములందు ప్రవేశించెను' — ఐతరేయోపనిషత్ (1-2-4) అను శ్రుతిననుసరించి తేజోరూపమున మానవులనేత్రములందు ఉన్న సూర్యుని స్తుతిని తెలుపు వేదాంశములను మూటిని నేత్రత్రయన్యాసమునకు ఋషులు నిర్ణయించుట ఎంతయు సమంజసమయి యున్నది. త్ర్యంబకయాగమున ఆరాధ్యుడగు త్ర్యంబకుడు రుద్రుడే అనియు రుద్రుడే అగ్నియనియు చెప్పవచ్చును. ఆ విషయమున ప్రమాణములు ఇట్లు చూపదగియున్నవి:

(1) 'త్ర్యంబకసాకమేధ'మున ఆరాధించబడు దేవతగా ప్రతిపూరుషం మొదలగు (తై. య. సం. 1-8-6; తై. బ్రా. 1-6-10) శ్రుతివచనములందు పలుమారులు రుద్రుడే చెప్పబడియున్నాడు. దీనినిబట్టి రుద్రుడే త్ర్యంబకుడు అని నిర్ణయించదగియున్నది.

(2) । రుద్రో వా ఏష యదగ్నిః ॥ (తై. య. సం. 5-4-3, 5-4-10, 6-3-5) అనుశ్రుతి వచనమును తైత్తిరీయ సంహితలో ఐదవ, ఆరవ కాండమునందలి బహుశ్రుతివచనములును రుద్రుడును అగ్నియు అభిన్నులని తెలుపుచున్నది. దీనిచే రుద్రుడును అగ్నియు త్ర్యంబకుడును అభిన్నులని నిర్ణయించ వీలగుచున్నది.

(3) । త్వమగ్నే రుద్రో అసురో మహోదివః ॥ - తై. బ్రా. (3-11-2) యజుర్వ్యాఖ్య - అగ్నియే రుద్రుడు - రుద్రుడే అగ్ని! ఈ అనువాకమున యజమానుడు రుద్రులను తనకు ధనప్రాప్తి కావలయునని ప్రార్థించుచున్నాను. 'శ్రియ మిచ్ఛే ద్ధుతాశనాత్' ఐశ్వర్యమును పొందవలయుననిన అగ్నిని ఉపాసించువలయును.

అనుసంప్రదాయవచమును అనుసరించి ఇందు ప్రార్థించబడిన రుద్రదేవులు అగ్నిదేవుని విభూతులే, అని నిర్ణయించవచ్చును [4].

## అగ్నిః - అగ్రిః

। నమో అగ్రియాయ చ ప్రథమాయ చ ॥ - తై. య. సం. 4-5-5(12) - మొదటనున్న వాని కొరకు, జగత్తు పుట్టుటకుముందున్న వాని కొరకు, ముఖ్యుడైన వాని కొరకు నమస్కరించుచున్నాను. । స యదస్య సర్వస్యాగ్ర మసృజ్యత తస్మా దగ్రిర్వై తమగ్ని రిత్యాచక్షతే పరోక్షమ్ ॥ - శ. బ్రా. 6-1-1(11); చూ. శ. బ్రా. 2-2-4(2). అగ్నికి 'అగ్రిః' అనునది ప్రత్యక్షనామము. సర్వమునకు అగ్రమున (పూర్వమున) సృజింపబడినవాడు అని అర్థము. 'అగ్నిః' అనునది పరోక్షనామము. ప్రజాపతి సృష్టికి 'అగ్ర'మునందు (ఆదిలో) సృష్టించబడిన ఆ యజ్ఞమూర్తే 'అగ్ని'. 'అగ్రే నయతి ఇతి అగ్నిః' - అని వ్యుత్పత్తి. ముందుండి నడుపు వాడు అగ్ని [3].

## అగ్నిః ప్రథమః

చతుర్వేదములలో ప్రథమ వేదం ఋగ్వేదం. దానిలో ప్రథమ మండలంలోని ప్రథమ సూక్తం 'అగ్ని సూక్తమ్'. । అగ్నిమీ''ళే పురోహితం యజ్ఞస్య దేవమృత్విజ''మ్ । హోతా''రం రత్నధాతమమ్ ॥ - ఋ. సం. 1-1-1. ఇది చతుర్వేదములకూ ప్రథమ మంత్రం. ఇలా వేదాలలోనే మొదటి శబ్దం - 'అగ్ని'. అనగా ప్రథమంగా పరబ్రహ్మ స్వరూపుడైన అగ్నినే ఋషులు దర్శించి 'అగ్రస్వరూపుడి'గా కీర్తించారు. ఆ ప్రథమ స్వరూపుని ఆరాధించడం అనే సంస్కారంవల్ల మనం తరిస్తాం. ఈ అగ్న్యారాధన సర్వకాలాలలోనూ, సర్వదేశాలలోనూ వుంది [3]. పైన చెప్పిన ఋగ్వేద ప్రథమ మంత్రం వివరణ ఏమనగా – "యజ్ఞానికి పురోహితుడైనవాడూ, దివ్యుడూ, యజ్ఞపు యజమాని, ఆహుతులను తీసుకువెళ్ళి దేవతలకు అందించేవాడూ, అనంత సంపన్నుడూ అయిన 'అగ్నిదేవుణ్ణి' ఆరాధిస్తాను".

## సర్వదేవతా స్వరూపమే అగ్ని

సమస్త దేవతలూ అగ్ని స్వరూపులే. దేవతల ఆవిర్భావం అగ్నివల్లనే. అసలు 'దేవ' శబ్దమే అగ్నిని తెలియజేస్తుంది. 'దీవ్యత ఇతి దేవః' - ప్రకాశ స్వరూపులు దేవతలు. ప్రకాశం అగ్ని లక్షణం. కనుకనే ఆ తైజస శరీరులు కాంతులు వెదజల్లే రూపాలతో ప్రకాశిస్తుంటారు. 'కోటిసూర్య ప్రతీకాశం', 'అగ్నివర్ణం' - ఇలా దేవతల రూపాన్ని వర్ణించే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. । 'అగ్నిర్వై దేవయోనిః సోగ్నేర్దేవ యోన్యా ఆహుతిభ్యః సమ్భవన్తి' ॥ - ఐతరేయ బ్రాహ్మణం నందు

పేర్కొనబడినది. దేవతలకు కారణమైన వాడు అగ్ని. ఆ దేవయోని అయిన అగ్నివల్లనే ఆహుతులు సంభవిస్తున్నాయి. వృక్షానికి నీరు అందివ్వాలంటే మూలానికి నీరు పోస్తాం. అలాగే దేవతలను తృప్తి పరచాలంటే అగ్నిని ఆరాధించాలి. అగ్నికే సమర్పించాలి [3].

## అగ్ని పురాణం

వ్యాస విరచిత పదునెనిమిది పురాణాలలో 'అగ్ని పురాణం' ప్రధానమైనది. ఈ పురాణం నందు విష్ణువు మరియు ఇతర వివిధ అవతారముల వివరణలు విశదీకరింపబడినవి. అగ్ని పురాణం పవిత్రమైనది ఎందుకంటే అది 'బ్రహ్మం' యొక్క సారాంశం (ద్వైవ సారాంశం) గురించి వెల్లడిచేస్తుంది. అగ్నిపురాణమును మొదట అగ్నిదేవుడు వశిష్ఠ మహర్షికి ఉపదేశించెను. వశిష్ఠుడు దీనిని వ్యాస మహర్షికి వివరించాడు. వ్యాసమహర్షి దానిని సూత మహామునికి చెప్పాడు. అంతిమంగా, సూతమహాముని నైమిశారణ్యంలోని ఋషుల సమావేశానికి అగ్ని పురాణాన్ని వివరించాడు. ఈ పురాణం నందు 383 అధ్యాయాలతో 16000 శ్లోకాలు కలిగిఉంటుంది. దీని యందు ఆచార ఆరాధన, విశ్వోద్భవ శాస్త్రం, చరిత్ర, యుద్ధం మరియు సంస్కృత వ్యాకరణం, చట్టం, వైద్యం మరియు యుద్ధ కళలు మొదలగు విభాగాలు ఉన్నాయి. అగ్నిపురాణంలో అందించబడిన వైద్య వృత్తాంతము సుశ్రుత సంహిత, అష్టాంగ సంగ్రహ, వృంద మాధవ మరియు చక్రదత్త మొదలైన వాటిలోకి తీసుకొనబడింది. అగ్ని పురాణాన్ని సర్వవిద్యా విషయములకు, శాస్త్రవిషయముకు భారతీయ సంస్కృతిగా సూచిస్తుంది. కనుక ఇది విజ్ఞానసర్వస్వం మరియు మానవ అభివృద్ధికి, అభ్యాసానికి సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తుంది [5,8].

## అగ్ని పితృదేవులు

పితృ అనగా జగత్తుని పోషించి, రక్షించి, పాలించేవాడు అని అర్థం. కనుక అగ్ని 'పిత'. అని ఋగ్వేద సంహిత యందు చెప్పబడినది. । స నః పితేవ సూనవేఽగ్నే సూపాయనో భవ । సచస్వా నః స్వస్తయే ॥ - ఋ. సం. 1-1-9 (అగ్ని సూక్తం 9వ మంత్రం) - 'ఓ అగ్నీ! కుమారుడికి తండ్రివలె నువ్వు మమ్ము సమీపించు. మా శ్రేయస్సు కొరకు సర్వదా మాతో ఉండుదువు గాక! మాకు శుభము కలిగించు గాక' అని అర్థం.

## దుర్గాసూక్తం - అగ్ని విశేషం

దుర్గాసూక్తం ఒక పురాతన స్తోత్రము. ఇది తైత్తిరీయ ఆరణ్యకమునందున్న మహానారాయణ ఉపనిషత్తులో (తై. ఆ. 10-2) పూర్తి సూక్తం

పేర్కొనబడింది. దుర్గాసూక్తంలో మొత్తం ఏడు మంత్రాలు ఉన్నాయి. ఈ సూక్తములోని 1,3,4 మరియు 6వ మంత్రము ఋగ్వేద సంహితయందున్న మూడు కాండల (1-99-1, 1-189-2, 5-4-9 మరియు 8-11-10) నుండి, రెండు మంత్రములు, రెండు (2) మరియు ఏడు (7) యజుర్వేదము నుండి, 5వ మంత్రము అధర్వవేద శౌనక సంహిత (7-63-1) నుండి తీసుకొనబడ్డవి. ఋగ్వేద సంహితయందున్న నాలుగు మంత్రాలకు 'అగ్నే' దేవత మరియు అవి అగ్నికి అంకితం చేయబడ్డాయి [8].

దుర్గాసూక్తం ప్రధానంగా అగ్నిని ఉద్దేశించి ప్రార్థిస్తూ చెప్పబడ్డ సూక్తం. ఇది మానవుల జీవితంలో వచ్చే అడ్డంకులు మరియు కష్టాల నుండి రక్షించమని 'అగ్నిని' ప్రార్థించే శ్లోకం. ఈ సూక్తం ప్రధానంగా మానవుల్ని 'ముక్తి' లేదా 'జ్ఞానోదయం' వైపు తీసుకువెళ్లే పడవ మనిషిగా అగ్ని భగవానుడి పాత్రను వివరిస్తుంది మరియు ప్రశంసిస్తుంది. ఈ సూక్త పారాయణ ముగింపులో, 'దుర్గ-గాయత్రీ' మంత్రం ఉంది, అది — 'ఓం కాత్యాయనాయ విద్మహే కన్యకుమారి ధీమహి తన్నో దుర్గిః ప్రచోదయా''త్'. ఈ మంత్రం దుర్గాసూక్తంలో భాగంగా లేదు. 'కాత్యాయన' అనే పదం బహుశా తల్లి దుర్గాదేవిని, కాత్యాయన మహర్షి కుమార్తెగా భావించడాన్ని సూచించడానికి ఉపయోగించబడింది. ఈ సూక్తం దుర్గాదేవికి స్తోత్రంగా ప్రసిద్ధి చెందింది మరియు పఠించబడింది, ప్రత్యేకించి ఏడు మంత్రాలలో ఒక మంత్రం ఆ పేరుతో దేవి (దేవత)ని సూచిస్తుంది [8].

## అగ్ని రూపములు

అగ్నిని తెలియజేయు ఆతని రూపములు మూడు. అవి - (1) పావకః (2) పవమానః (3) శుచిః అనునవి. వీనిలో (1) పవమానుడు మథించుటచే — ఘర్షణముచే ఏర్పడు అగ్ని (2) పావకః — వైద్యుతాగ్ని (3) శుచిః — సౌరాగ్ని. ఇట్లు మూడు రూపములు తన్ను తెలుపునవిగా కలవాడు కావున 'అగ్ని త్ర్యంబకుడు' — త్రి = మూడు; అంబకములు = తనను తెలుపునవి (అగు రూపములు) కలవాడు [8].

ఈ అంశము వైదికాగమసంప్రదాయముచేతను, నేటి విజ్ఞానశాస్త్రానుభవముననను తెలియు విషయము. కనుక ఇట్లు శతరుద్రీయ నామక రుద్రాధ్యాయ మంత్రములందును ఆరాధించబడుచున్న తత్త్వము అగ్ని=రుద్రుడు=త్ర్యంబకుడు=శివుడు, సోపాధికుడుగా సృష్టిస్థితిసంహారతిరోధానానుగ్రహకర్త అగు పరమేశ్వరుడు. నిరుపాధికుడుగా విమలజ్ఞానాత్మకమగు పరమాత్మతత్త్వము.

## యజ్ఞాగ్ని


అగ్నిని 'దేవ ముఖ' అని పిలుస్తారు - । అగ్నిముఖా ఏవ దేవతాః" ప్రీణాతి । అగ్నిం వా అన్వన్యా దేవతాః" ॥ (తై. బ్రా. 3-7-1). అగ్ని యజ్ఞానికి కేంద్ర దేవత. మంత్ర సమర్పణ చేసి ఇచ్చిన హవిస్సులు ఆ యా దేవతలకు అగ్నిద్వారా సమర్పించబడతాయి । యజ్ఞముఖే యజ్ఞముఖే హోతవ్యాః" ॥ [తై. బ్రా. 3-8-8(30)]. యజ్ఞము మరియు యాగము కోసం పుట్టించేటువంటి అగ్నిని 'యజ్ఞాగ్ని' అని అంటారు. అగ్నిమన్థన పరికరము ద్వారా యజ్ఞాగ్ని ఉద్భవించును. శమీవృక్ష గర్భము నుండి పెరిగిన అశ్వత్థవృక్ష మాను నుండి అరణిని తయారుచేసి, వాటిని అగ్నిమన్థన యంత్రముగా వాడుదురు. అగ్ని ఒకసారి దేవతలనుండి అదృశ్యమై అశ్వరూపము (గుఱ్ఱము) దాల్చి అశ్వత్థ వృక్షమునందు బస చేసినాడని వేదమునందు చెప్పబడినది. అశ్వ మనగా గుఱ్ఱము. ఏ వృక్షమునందైతే అశ్వరూపుడై అగ్ని నివసించెనో ఆ వృక్షానికి 'అశ్వత్థము' అని పేరు వచ్చినది. అగ్ని మన్థన యంత్రముకొఱకు ఉపయోగించే అశ్వత్థవృక్ష మాను, శమీవృక్ష మాను గర్భమునందుండి ఎదిగినదై ఉండవలెను. ఇచ్చట సాధారణ అశ్వత్థవృక్ష మానుని ఉపయోగించరాదు. । శమీగర్భాదగ్నిం మన్థతి ॥ (తై. బ్రా. 1-1-9). । శాన్తయోనిగ్ం శమీగర్భమ్ । అగ్నయే ప్రజనయితవే" । యో అశ్వత్థశ్శమీగర్భః ॥ (తై. బ్రా. 1-2-1). ఇక్కడ ప్రతిపాదించిన మంత్రార్థము ఏమనగా, శమీవృక్ష గర్భకోశమునకు శాంతింపజేసే స్వభావము ఉన్నది. అందువలన అగ్నిని శాంతపరచు గుణము కలిగిన శమీవృక్ష గర్భము నుండి పెరిగిన అశ్వత్థవృక్ష మానుని మాత్రమే 'అరణి' తయారీలో ఉపయోగించవలెను [చిత్రపటం – 3].

## అగ్నిమన్థన పరికరము, భాగములు మరియు యజ్ఞాగ్ని పుట్టుక విధానము

తైత్తిరీయ సంహితయందు అగ్నిమంథన పరికరము, దాని భాగములు మరియు యజ్ఞాగ్ని ఉద్భవించు విధానము ఈ క్రింది మంత్రమునందు పేర్కొనబడినవి:

। అగ్నేర్జనిత్రమసి వృషణౌ స్థ ఉర్వశ్యస్యాయురసి పురూరవా ఘృతేనాఽక్తే వృషణం దధాథాం గాయత్రం ఛన్దోఽను ప్ర జాయస్వ త్రైష్టుభం జాగతం ఛన్దోఽను ప్ర జాయస్వ ॥ [తై. య. సం. 1-3-7(12)]

క్రింది భాగమున నొక కొయ్యను, పై భాగమున నొక కొయ్యను ఉంచి రెండింటికి మధ్య భాగమున రంధ్రము చేసి ఆ రంధ్రములందు ఒక కాష్ఠమునుంచి




**చిత్రపటం – 3: యజ్ఞాగ్ని - అగ్నిమన్థన పరికరము**

**[తై. య. సం. - 1-3-7(12)]**

పైదానిని గట్టిగా నదిమి పట్టుకొని మధ్యమున నున్న కాష్ట విశేషమును త్రాడు కట్టి కవ్వమునువలె త్రిప్పినచో అగ్నిపుట్టును. క్రింది దారువునకు 'అధరారణి' అనియు, పైన నున్న దారువునకు 'ఉత్తరారణి' అనియు వ్యవహారము. మధ్యమున నున్న కాష్ఠము ఇచట శకలమని వ్యవహరింపబడినది. క్రింది అరణి 'ఊర్వశి'గాను, ఉత్తరారణి 'పురూరవుడు'గాను వర్ణింపబడినవి. ఈ రెండింటి సంబంధమువలన అగ్నిపుట్టును, కావున అరణులు మాతా పితృ స్థానీయములైనవి. యజ్ఞమునకు ముఖ్యముగా కావలసిన అగ్ని, అరణి ద్వయమునుండి పుట్టును, కావున అరణి ద్వయము యజ్ఞమునకు ఆయుస్థానము వంటివి. (అధ్వర్యుడు అరణి ద్వయమును దర్భలచే అభిమంత్రించి అగ్ని మంథన శకలమును ఆ అరణి ద్వయమునందు సమకూర్చవలెను). 'ఓ అగ్నీ! నీవు హోత పఠించుచున్న గాయత్రీ, త్రిష్టుప్, జగతీ ఛందస్సులను అనుసరించి అతిశయముగా నుద్భవించుము (అగ్ని పుట్టుటకై అధ్వర్యుడు అరణిని మథించవలెను)' [చిత్రపటం – 3].

వేదమునందు మానవుని యొక్క శ్రేయస్సునే కాక పశుసంబంధ శ్రేయస్సు – (। **శం నో అస్తు ద్విపదే''** । **శం చతుష్పదే** ॥) - మంత్రములను చెప్పబడి వాని శ్రేయస్సును కోరుకున్నది (తై. య. సం. 4-2-10) - పశుశీర్షోపధానము చెప్పబడినది. ముఖ్యముగా తై. య. సం. 4-2-10 అనువాకము నందు ఈ విధముగా

చెప్పబడినది – 'సహస్ర, సంఖ్యాక జ్వాలారూప చక్షువులుకల ఓ అగ్నీ! గ్రామ్యములు, అరణ్యములునైన పశువుల దాహరూప హింసను చేయకుము' అని వేడుకోవడము.

ఓం సర్వే భవన్తు సుఖినః సర్వే సన్తు నిరామయాః ।

సర్వే భద్రాణి పశ్యన్తు మా కశ్చిద్దుఃఖభాగ్భవేత్ ॥

– ఓం తత్సత్ –

## పరామర్శ గ్రంథములు


1. ఆర్ష విజ్ఞాన సర్వస్వము. వేద సంహితలు, మొదటి సంపుటము. ఆచార్య ఎస్. బి. రఘునాథాచార్య (ప్రధాన సంపాదకులు), తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 1982.

2. కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత, వేదార్థ దీపికా సహితము. సంకలనము, అనువాదము మరియు వ్యాఖ్యానము - శిరోమణి రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి (సంపాదకులు), తెలుగులో 1-7 కాండలు. తిరుమల తిరుపతి దేవస్థానములు (తి.తి.దే.), సీరీస్ నం: 324, తి.తి.దే. ప్రెస్, తిరుపతి, 1989.

3. షణ్ముఖశర్మ సామవేదం (1999). అగ్ని - స్వాహా - స్వధా. ఋషిపీఠం పత్రిక, 1(5): 5-9.

4. మహాన్యాస మంత్రవాఖ్య. సీతారామాంజనేయులు పాతూరి. టాగూరు పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2010.


5. Boddupalli, R.S. Plant Biology of Yajurveda - Project report submitted to the Indian National Science Academy (INSA), XLI+639 pages with 84 plant photographs, New Delhi, 2019.

6. Boddupalli, R.S. (2019). Plant Biology of Yajurveda. *Indian Journal of History of Science*, 54(2): 226-237.

7. అగ్నిమన్త్ర మంజరీ (తాత్పర్య సహితము). రాఘవ బొడ్డుపల్లి (సంపాదకులు). శ్రీ గిరిజా ప్రచురణలు, గుంటూరు, 2022.

8. రాఘవ బొడ్డుపల్లి. (2022). యజ్ఞ యాగములు – వైశిష్ట్యము. *వేదగఙ్గా*, 28: 212-246.

## About the Author



**డా. రాఘవ బొడ్డుపల్లి, పి. హెచ్.డి.** - వీరు 35 ఏళ్లకు పైగా బయోటెక్నాలజీ విభాగంలో శాస్త్రవేత్తగా పనిచేశారు. గత పదమూడు సంవత్సరాలలో, వీరు కృష్ణ యజుర్వేద అధ్యయనం పూర్తి చేసారు. వీరు జాతీయ మరియు అంతర్జాతీయ శాస్త్రీయ పత్రికలలో వేదాలలో ఉన్న వృక్షశాస్త్రానికి సంబంధించి అనేక పరిశోధనా వ్యాసాలను ప్రచురించినారు. డా. రాఘవ ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (INSA), న్యూఢిల్లీ వారిచే స్పాన్సర్ చేయబడిన 'ప్లాంట్ బయాలజీ ఆఫ్ యజుర్వేద' మరియు 'అథర్వవేదంలో వెల్లడి చేయబడిన వైద్యచికిత్సకు సంబంధిత మొక్కలు - వాటి వివరణలు మరియు ఉపయోగాలు' అనే పేరుతో రెండు వేద ప్రాజెక్టులను పూర్తి చేసినారు. డా. రాఘవ ప్రస్తుతం 'వేదవాణి' పత్రికకు చీఫ్-ఎడిటర్ గా పనిచేస్తున్నారు.

# Veda Samskruti Samiti

13-1-62 & 13-1-47/1
Veenapani Nagar, Malkajgiri
HYDERABAD Telangana



Veda Samskruti is an inherent intellectual property of Bhaarata dEsham. It is the basic duty and right of every citizen in Bhaarata dEsham to protect this Intellectual property. Indian Constitution and Law provides provision for protection and preservation of its culture, its monuments, architecture etc.

The Chaturvedas said to have 1131 shaakhaas right up to the time of Aadi Shankaraachaarya and thereafter during last more than ten centuries, many shaakhaas are out of practice due to various reasons and presently only seven shaakaas are in the practice of Guru shiShya parampara.

There is a need to continuously preserve these available shaakhaas which may likely to disappear in future due to various external forces acting in the country vigorously with the power of money and global politics. It is time for the intellectuals of Bharata dEsham to wake-up and work collectively to protect and preserve Veda Samskruti of Bharata dEsham, by empowering the Youth of Bharat dEsham, the future care takers of this great Indian Heritage , with suitable education of our correct history and culture.

The above background lead to formation of this Veda Samskruti Samiti which is registered under Societies acts of Government of Telangana, with Regd. No. 961/2016 by Sri A.H. Prabhakara Rao, who is the Founder and President of the Samiti.

The **vEda vaaNee** e-journal, ISSN 2583-9020, is now publishing its **Volume 2, Issue 3, October 2024.**